హామీల అమలుపై ఆంక్షలు ఎందుకు

తాడేపల్లి రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే సంక్షేమ పథకాల కన్నా ఎక్కువగా ఇస్తామని ప్రజలను నమ్మబలికిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి రాగానే హామీలను తుంగలోకి తొక్కారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి నగర్ 5వ వార్డులో చంద్రబాబు రీకాల్ మేనిఫెస్టో పేరు మీద బాబు ష్యూరిటీ – మోసాలు గ్యారెంటీ కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వేమారెడ్డి ముందుగా చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను ప్రజల సెల్‌ఫోన్‌లో స్కాన్ చేసి ఇచ్చిన హామీలు అమలు చేయని విధానం గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వారు నోరు మెదకుండా బెదిరిస్తున్నారని, ఇది మంచి ప్రభుత్వం అంటూ కార్యక్రమం నిర్వహిసస్తూ ప్రజల్ని మోసగించేందుకు నానా తంటాలు పడుతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు వచ్చేవని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, పట్టణ ఉపాధ్యక్షులు జీలగ పెదగాలయ్య, వేల్పుల ఎలీషా, ప్రధాన కార్యదర్శులు చిన్నపోతుల దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహసంధ్య, మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, పట్టణ కార్యదర్శి తాళ్లూరి అమృతరావు, నాయకులు పెరికే బాబూరావు, డేవిడ్, మార్కు, రాష్ట్ర, జిల్లా, పట్టణ, రూరల్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శనివారం నాటికి 229వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు గురవయ్య, సాంబశివరావు, రమాదేవి, కార్మికులు రమణ, శారద, ఇమాంబి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్యారీ కంపెనీ గ్రౌండ్‌లో నివాసం ఉంటున్న పేదలకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఇస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నామన్నారు. నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, వై.బర్నబాస్, డి.వి భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ సమావేశం నేడు

తాడికొండ: తుళ్లూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ మండల స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి వనమా బాల వజ్రబాబు పాల్గొననున్నారని అన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజా నాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరం

తాడేపల్లి రూరల్: మంగళగిరిలో ప్రజా సంఘాల కార్యాలయంలో రెండు రోజుల పాటు జరుగనున్న ప్రజా నాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌లు మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న రుగ్మతలు, సమస్యలకు పరిష్కారాలను చూపడానికి ప్రజా కళాకారులు అనేక కొత్త కళారూపాలు సృష్టించి ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గాయకులు ఎ.జగన్ కళాకారులకు పాటలలో శిక్షణ ఇవ్వగా.. కవి పీఎస్ఎం లఘు నాటికలను నేర్పించారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.రవి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, ఆర్‌వీ రాఘవయ్య, లూథర్ పాల్, సుమ, రాజ్యలక్ష్మి, పార్వతి, ప్రసాద్, ప్రజా సంఘాల సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన



ఫిరంగిపురం: మండంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు శనివారం పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రి స్థితిగతులను ఆయన అధికారులతో మాట్లాడారు. సీసీ టీవీ కెమేరాల పనితీరు, రికార్డింగు వ్యవస్థలను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కె.ప్రసాద రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంటీఎంసీ కార్యాలయం ముట్టడి

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధి నాలుగో వార్డులోని ఎస్టీ కాలనీలో ఎన్నో ఏళ్లుగా కొండ ప్రాంతంలో ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. 150 మంది ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్నారని.. వారందరికీ ఇళ్ల పట్టాలు రాయకుండా కేవలం 40 మందికి మాత్రమే రాయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, మంగళగిరి పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, సీనియర్ నాయకులు జేవీ రాఘువులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. అర్జీలు అందిస్తే విచారించి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. దీంతో ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రు గ్రామ సమీపంలోని జోసిల్ కంపెనీలో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కంపెనీ యాజమాన్యం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కంపెనీ సిబ్బందితో యాజమాన్యం ప్రతిజ్ఞ చేయించారు.

ఫిరంగిపురం: ప్లాస్టిక్ రహిత గ్రామానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తహసీల్దార్ జె.ప్రసాద రావు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయం సిబ్బందితో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏవో ఏకే బాబు, అంగన్‌వాడీలు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండ: డికొండ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌హెచ్‌టీసీ)లో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి నేతృత్వంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ఇంటర్న్‌లు, పీజీ విద్యార్థులు కలిసి ఆర్‌హెచ్‌టీసీ పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం 'ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం -పర్యావరణాన్ని కాపాడుదాం' అన్న సందేశంతో అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామ, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జయలక్ష్మీ, బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధా, కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ నలినీ దేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల: ప్లాస్టిక్ వినియోగం క్రమేణ పెరిగిపోతోందని డాక్టరు కె.కె.ఆర్.ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధర్‌రావు అన్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ ఆర్ రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రం వద్ద శనివారం పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. గ్రామంలో శుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను సన్మానించుకోవడం మన బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం కార్మికులను శాలువాలతో సన్మానించారు.

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం



సమ్మెలో పాల్గొన్న కార్మికులు



భిక్షాటన చేస్తున్న కార్మికులు

తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎంటీఎంసీ రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎం.రవి అన్నారు. శనివారం ఎర్రబాలెంలో ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె ఏడో రోజుకు, మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకున్నాయి.

ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల స్పందించి సమ్మె పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.బాబు, ఒ.రామారావు, ఆదిలక్ష్మి, కోటేశ్వరి, పార్వతి, కరీముల్లా, శివకోటి, చిన్న, శ్రీను, మేరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన..

తాడేపల్లిలోని మున్సిపల్ కార్మికులు శనివారం సమ్మె సందర్భంగా భిక్షాటన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్యారీ కంపెనీ గేటు, బోసుబొమ్మ సెంటర్ మీదుగా సీఐటీయూ కార్యాలయం వరకూ దారి పొడవునా జోలి పట్టి సాయం అందించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఫెడరేన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, వేణు, డేవిడ్, ఝాన్సీ, సంతోషం, వెంగమ్మ, కామాక్షి, రాంబాబు, నాయకులు వెంకటరెడ్డి, మహిళా సంఘం నాయకులు డి.శ్రీనివాస కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

మంగళగిరి టౌన్: ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శనివారం నాటికి ఏడో రోజుకు చేరింది. పారిశుద్ధ్య కార్మికులు, ఇతర కార్మికులు చేస్తున్న సమ్మె మూడో రోజుకు చేరింది. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. సమ్మె శిబిరం వద్ద నిరసన తెలియజేస్తూ వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, నాయకులు వీవీ జవహర్‌లాల్, జేవీ రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పు కార్యక్రమంలో కార్మికులు, నాయకులు

రాజధాని రహదారుల పనుల్లో పురోగతి సాధించాలి

తాడికొండ: రాజధాని అమరావతిలో రహదారుల నిర్మాణాలను వేగవంతం చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి డి.లక్ష్మీ పార్థసారధి ఆదేశించారు. శనివారం ఆమె మేఘా కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారుల నిర్మాణాలను పరిశీలించారు. విజయవాడ పశ్చిమ బైపాస్‌కు అనుసంధానంగా పనులు జరుగుతున్న ఎ-6 ఎలివేటెడ్ క్యారిడార్ పనులను, పలు రహదారుల నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. గుత్తేదారు సంస్థ క్యాంపు, మెటీరియల్ స్టాక్ పాయింట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు.

టూరిజం పాయింట్‌గా శాఖమూరు రిజర్వాయర్..

అమరావతిలోని శాఖమూరు రిజర్వాయర్ గొప్ప పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్మీ పార్థసారధి సూచించారు. ఎ-11 రహదారిపై ప్రయాణించే వారికి గొప్ప సుందర దృశ్యంగా ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసి ల్యాండ్ స్కేపింగ్ జాగ్రత్తగా చేపట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఏడీసీ ఉద్యానవన నిపుణులు వి.ఎస్.ధర్మజ, పి.విశ్వప్రసాద్‌లను ఆదేశించారు. ఈ పర్యాటనలో ఏడీసీ ఛీఫ్ ఇంజినీరు ఆర్.గోపాలకృష్ణారెడ్డి, ఎస్ఈలు నరసింహమూర్తి, వి.శ్రీనివాస్, ఈఈలు బసవేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏడీసీ ఛైర్మన్ లక్ష్మీ పార్థసారథి

ప్లాస్టిక్ కవర్లను నియంత్రించాలి

తాడేపల్లి రూరల్: ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించాలని తాడేపల్లిలోని పలు పాఠశాల విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని.. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ సంచులను వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అధికారులు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు, మాజీ కౌన్సిలర్లు ఇట్టా భాస్కర్, కాటబత్తుని నిర్మల, సీనియర్ నాయకులు కొసరాజు శైలజ, కొయ్యగూర మల్లేశ్వరరావు, తాడిబోయిన గోపి, మంగళగిరి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఉయ్యాల శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరిలో..

మంగళగిరిలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాష ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాలిగోపురం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్లాస్టిక్‌ని రీసైకిలింగ్ చేసే విధానాలు, వినియోగాన్ని తగ్గించే విధంగా కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల, బీజేపీ నాయకులు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్, నాయకులు పంచుమర్తి ప్రసాద్, గుత్తికొండ ధనుంజయ్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, వార్డు అధ్యక్షులు నల్లగొర్ల శివరామకృష్ణ, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

బహిరంగ ప్రదేశాలలో పొగ తాగితే ఉపేక్షించం



మేడికొండూరు: బహిరంగ ప్రదేశాలలో పొగ తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాలలో బహిరంగ ప్రదేశాలలో మద్యం, గుట్కా, పొగాకు సేవించే వారిపై దాడులు చేసి కేసు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ దాడులు నిరంతరం జరుగుతాయని తెలిపారు.

పేదలకు అండ ఎర్ర జెండా

పొన్నెకల్లు(తాడికొండ): పేదలకు అండ ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పొన్నెకల్లు గ్రామ సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజవర్గ 23వ మహా సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ జెండా ఆవిష్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టులకు కంచుకోట పొన్నెకల్లు గ్రామం అని, కమ్యూనిస్టు పార్టీ పుట్టుక, దాని ప్రాధాన్యత, విశిష్టత, బాధ్యతలు వివరించారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే కుట్రలను బీజేపీ చేస్తోందని మండిపడ్డారు. అనంతరం పార్టీ కౌన్సిల్ సభ్యులుగా 21 మందిని, కార్యవర్గ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు. తాడికొండ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా ముప్పాళ్ల శివ శంకర్‌రావును రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, వ్యకాస జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరావట్నం రామకృష్ణ, ఆరేటి రామారావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది చెయ్యి.. లేదంటే అంతు చూస్తా!

- యువకుడికి తాడేపల్లి సీఐ బెదిరింపులు
- విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసిన యువకుడు

తాడేపల్లి రూరల్: 'నేను చెప్పింది చెయ్యి... లేదంటే గంజాయి కేసు పెట్టి లోపల వేస్తా'.. అంటూ ప్రజల్ని రక్షించాల్సిన ఓ సీఐ ఓ యువకుడితో అతి క్రూరంగా వ్యవహరించిన వైనమిది. సీఐ వేధింపులు, థర్డ్ డిగ్రీ తాళలేక శనివారం తాడేపల్లిలోని తన నివాసం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన యువకుడు తన గోడు వెళ్లబోసుకున్నాడు. బాధితుడు వేముల వెంకటేష్ అలియాస్ వెంకీ మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని సలాం హోటల్ సెంటర్‌లో తన ఇంటి రేకులను తన పెదనాన్న కొడుకులు పగలకొట్టి కళ్లలో కారం జల్లి తీవ్రంగా కొట్టారని గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అప్పుడు సీఐ వీరేంద్రబాబు తగిన తగిలిన దెబ్బలు చూసి స్పందించి ఎంఎల్‌సీ చేయించుకోమని కానిస్టేబుల్‌ను ఇచ్చి ఆసుపత్రికి పంపించారని, ఇంతవరకు బాగానే ఉందన్నారు. అయితే ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చేసరికి తన ఇంటి విషయానికి రాజకీయ రంగు పులిమి టీడీపీ వారికే ఎదురు తిరుగుతావా అంటూ తనపై కేసు పెట్టాడన్నారు. తనను బట్టలు ఊడదీసి సెల్‌లో కూర్చోబెట్టారని, రాత్రి 12 గంటల సమయంలో సీఐ వీరేంద్రబాబు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లను నన్ను కొట్టమని చెప్పగా వారు నన్ను కొట్టలేదని, స్వయంగా ఆయనే నా రెండుకాళ్లు కట్టేసి కాళ్లపై బూటుకాలు పెట్టి అరికాలి మీద విచక్షణా రహితంగా కొట్టారని వాపోయాడు. తాను తాపీపని చేసుకుంటానని, తన కాళ్లకు బొబ్బలు ఉన్నాయి.. కొట్టవద్దు అని వేడుకున్నా.. కనికరం లేకుండా ఆయన కొట్టడంతో ఆ బొబ్బలు చితికి ఐదు రోజులపాటు నడవలేకపోయానని కన్నీళ్ల పర్యంతమయ్యాడు.



మీడియాతో మాట్లాడుతున్న బాధితుడు వేముల వెంకటేష్ అలియాస్ వెంకీ

గంజాయి కేసు కట్టి లోపల వేస్తా..

ఆ బాధ తట్టుకోలేక టీడీపీ ఆఫీసుకు వెళ్లగా వారు తమ పెదనాన్న కొడుకులకు రూ.5 లక్షలు కట్టు, వారికి స్థలంతో సంబంధం లేదని సంతకాలు పెడతారని, అందరినీ పిలిపించే బాధ్యత వారిదే అని చెప్పారని, నేను అన్నీ సిద్ధం చేసుకున్న తరువాత డబ్బులు కట్టడానికి వెళితే అందులో కొంత మంది సంతకం పెట్టేందుకు నిరాకరించారన్నారు. ఇద్దరి మధ్య వాదనలు జరగడంతో దాన్ని ఆధారంగా చేసుకున్న సీఐ వీరేంద్ర రెండు రోజులక్రితం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చాలా అసభ్యంగా మాట్లాడుతూ విచక్షణా రహితంగా అరికాళ్లపై కొట్టి గాయపరిచాడన్నారు. నన్ను చంపేయండి అని కాళ్లు పట్టుకున్నా వదలకుండా హింసించారన్నాడు.

డబ్బులు తీసుకువచ్చి ఇవ్వకపోతే గంజాయి కేసు పెడతానంటూ, తాడేపల్లిలో నువ్వు అయినా ఉండాలి... నేను అయినా ఉండాలి అంటూ బెదిరిస్తున్నారని, రెండు మూడు రోజుల నుంచి వేర్వేరు ఫోన్ల నుంచి సీఐ వీరేంద్ర బెదిరిస్తున్నారని బాధితుడు వేముల వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దయచేసి తన కుటుంబాన్ని సీఐ బారి నుండి కాపాడాలని.. లేకుంటే తన కుటుంబానికి చావే శరణ్యం అని, తాము చనిపోతే దానికి కారణం సీఐ వీరేంద్రే అని వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

రాజధాని రైతులకు ఈ-లాటరీ విధానం

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 12 గ్రామాలకు చెందిన 59 మంది రైతులకు శనివారం విజయవాడలోని ఏపీ సీఆర్డీయే కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 138 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఏసీ) వి.డేవిడ్ రాజు మాట్లాడుతూ.. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించారో వివరించడానికి ప్రత్యేకంగా జి.ఐ.ఎస్. సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్ల బిగింపుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. శనివారం మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీల పెంపు పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారంగా మారిందని వాపోయారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వద్దంటి దుర్గారావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కటారి జేసుదాసు, జాలాది విజయేందర్‌రావు, పంతగాని మరియదాసు, జాలాది నవీన్, నరేంద్ర, సీపీఎం నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు భీమిరెడ్డి కోటేశ్వరి, తమ్మ ప్రసాద్‌రెడ్డి, బాబు వరప్రసాద్, గడ్డం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: స్మార్ట్ మీటర్లు బిగించడం ద్వారా పేదలపై మరింత భారం పెరుగుతోందని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాల రాజు అన్నారు. శనివారం తుమ్మపూడి గ్రామం ముస్లిం ఏరియాలో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. స్మార్ట్ మీటరు బిగిస్తే ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.చిరంజీవి, వి.విజయ మాబాబీ, రహీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాల ప్రచారం నిర్వహిస్తున్న బాలరాజు

జ్ఞాన శక్తితోనే యోగాకు మార్గం



యోగా విశిష్టతను వివరిస్తున్న యోగానందం

తాడేపల్లి రూరల్: మంగళగిరి శ్రీ మార్కండేయ పద్మశాలీ కల్యాణ మండపంలో స్థానిక మాస్టర్ సీవీవీ యోగా ప్రభా సెంటర్ ఆధ్వర్యంలో శ్రీ కొత్త రామకోటయ్యతాత ఆశీస్సులతో రెండు రోజుల పాటు జరిగే మెర్రీ లైఫ్ డే గురుపూజ మహోత్సవం, బ్రహ్మశ్రీ వేలూరి ప్రభాకర్ శాస్త్రి 136వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని మాస్టర్ సీవీవీ యోగా గురువులు, ప్రతినిధులు హాజరై ప్రవచనాలు అందజేశారు. విజయవాడ మాస్టర్ సీవీవీ యోగా ప్రభాస్ సెంటర్ గురువులు పోతురాజు యోగానందం ప్రవచనం చేశారు. మానవ జన్మ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల మాస్టర్ సీవీవీ యోగ క్షేత్రాల ప్రతినిధులు శ్యామల, సీతారాం, శివానందం, కొంగతి సుబ్బారావు, విష్ణుమూర్తి, స్థానిక యోగ ప్రభా సెంటర్ ప్రతినిధులు దామర్ల హనుమంతరావు, పణిదపు రమేష్, దామర్ల వీర ప్రసాద్, కుంభకోణ రామమూర్తి, సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.